క్లుప్తంగా

శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడికి భస్మార్చన



భస్మార్చన చేస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలో సుప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో గురువారం కృత్తిక మహోత్సవం ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరుడి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని మూలవిరాట్టుకు విశేష అభిషేకం, లక్ష సుబ్రహ్మణ్యనామాలు పఠిస్తూ స్వామివారికి భస్మార్చన చేశారు. భక్తులు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తెరుచుకోని కొత్త కళాశాల

హుస్నాబాద్: ప్రభుత్వం మూడు నెలల క్రితం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల వినియోగంలోకిరాలేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య గురువారం తెలిపారు. కళాశాలలో మౌలిక వసతులు కల్పించకుండానే భవనాన్ని ప్రారంభించారన్నారు. ప్రస్తుతం రేకుల షెడ్లలోనే కొనసాగుతోందని చెప్పారు. వెంటనే మౌలిక వసతులు కల్పించి వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాంసాని రాకేష్, చెన్నూరి రాజేష్, చరణ్, అంజిరెడ్డి, రాహుల్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమంలో ప్రభుత్వాలు విఫలం

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమ పథకాల అమలులో విఫలమయ్యాయని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఇన్‌చార్జి కవ్వంపెల్లి సత్యనారాయణ ఆరోపించారు. బెజ్జంకిలో గురువారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. పాల ఉత్పత్తిదారులతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికలల్లో గెలిచేది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మల్లేశం, రాములు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ రాజకీయాలను తరిమికొట్టాలి: బీజేపీ

మద్దూరు(హుస్నాబాద్): దేశం నుంచి అవినీతి, బంధుప్రీతి, కుటుంబ రాజకీయాలను తరిమికొట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బురుగు సురేష్ అన్నారు. గురువారం మండలంలోని వీరాభైరాన్‌పల్లిలో కేంద్రం చేపట్టిన మేరా మిట్టీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులను స్మరించుకుంటూ బైరాన్‌పల్లి గ్రామ స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి ప్రతిజ్ఞ చేశారు.

విద్యాభివృద్ధిపై అవగాహన

మిరుదొడ్డి(దుబ్బాక): వనరులను విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య సూచించారు. అక్బర్‌పేట–భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాభివృద్ధిపై అవగాహన కలిగించారు. అనంతరం ఎర్త్ ఫౌండేషన్ సంస్థ విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.

వృత్తి విద్యతో ఉపాధి

కొండపాక(గజ్వేల్): వృత్తి విద్య స్వయం ఉపాధి కల్పిస్తుందని లేబర్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణి కౌముదిని పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలకు సీఎస్ఆర్ ఫండ్ కోటాలో కొడకండ్ల గ్రామశివారులోగల ప్రసాద్ సీడ్స్ కంపెని సహకారంతో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్, ఆర్వో ప్లాంట్, కంప్యూటర్‌లను ప్రారంభించారు. అనంతరం వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

కాలయాపన తగదు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం సాగు పెట్టుబడి సహాయంగా ఇచ్చే రైతుబంధు చెల్లింపుల్లో కాలయాపన చేయడం తగదని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బెజ్జంకిలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10 ఎకరాలకు రైతుబంధు పరిమితం చేసి అర్హులందరికీ ఇవ్వాలన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారమివ్వాలని డిమాండ్ చేశారు.

నిరంతర ప్రక్రియ

గజ్వేల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి, మైనార్టీలకు సాయం పథకాలు నిరంతర ప్రక్రియ అని, ఈ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో కేసీఆర్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ప్రభుత్వ పథకాలపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు.

పోరాటాలకు సిద్ధంకండి

కేంద్ర కార్మిక సంఘాలు



చేర్యాలలో ధర్నా చేస్తున్న కార్మికులు

హుస్నాబాద్: ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వంపై కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి బెక్కంటి సంపత్ పిలుపు ఇచ్చారు. గురువారం పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో కేంద్ర విధానాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మోదీ తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

చేర్యాల(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు అందె అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో కార్మికులకు పిలుపునిచ్చారు. అఖిల భారత కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు గురువారం అంగడి బజారు సమీప రాజీవ్ రహదారిపై మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాక: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం దుబ్బాకలోని పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో జాతీయ కార్మిక సంఘాలతో కలిసి మహాధర్నా నిర్వహించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని క్విట్ మోదీ, క్విట్ బీజేపీ నినాదంతో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, నాయకులు చంద్రారెడ్డి, భాస్కర్, మంజుల, శ్యామల, భూలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: క్విట్ ఇండియా స్ఫూర్తితో ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, బీఆర్‌టీయూ జిల్లా నాయకులు చిప్పల యాదగిరి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కృష్ణ, మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీను అన్నారు. క్విట్ ఇండియా డే సందర్భంగా కేంద్ర విధానాలను నిరసిస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో దేశాన్ని అభివృద్ధి చేసుకుందామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాల స్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల చౌరస్తా వద్ద కార్మిక సంఘాలు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ వర్గాలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారని, దీంతో కార్మికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మహాధర్నాలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఇదారి మల్లేశం, అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లిలో బాణసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

కొమ్మూరి నియామకంపై హర్షం

కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని జనగామ డీసీసీ అధ్యక్షుడిగా నియమించడంతో మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కొమురవెల్లి, మర్రిముచ్చాల గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. గురువారం కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కొమ్మూరి ప్రతాపరెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. తమ నాయకుడి నియామకానికి సహకరించిన ఏఐసీసీ నాయకుడు కేసీ వేణుగోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే

మద్దూరు(హుస్నాబాద్): వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి అన్నారు. జనగామ జిల్లా పీసీసీ అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి నియమితుడుకావడంతో మండల కేంద్రాల్లో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాఖత్‌భాయ్, జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, బండి బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ టికెట్ బీసీలకు కేటాయించాలి

బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈసారి హుస్నాబాద్ టికెట్ బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని జనగామలో గురువారం పల్లెపల్లెకు బీసీ చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 2 లక్షల పైగా ఓటర్లు ఉంటే అందులో 1.60 లక్షలు బీసీలు ఉంటారన్నారు. 20 ఏళ్లగా ఇతర కులాలకు చెందిన వ్యక్తులకే ఎమ్మెల్యే టికెట్ ఇస్తున్న రాజకీయ పార్టీలు బీసీలకు ఇచ్చేవిధంగా ఆలోచించాలన్నారు. కచ్చితంగా బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గతంలో బీసీల ఐక్యతతో దేశిని చిన్నమల్లయ్య నాలుగు సార్లు, బొమ్మ వెంకన్న బీసీ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారన్నారు. ఆ దిశగా నియోజకవర్గంలోని బీసీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు పల్లె పల్లెకు బీసీ చైతన్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పూదరి దేవేందర్‌గౌడ్, పూదరి ప్రసాద్, ఎల్లయ్య, రాజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలో మంత్రి హరీశ్‌రావు శుక్రవారం పర్యటించనున్నట్లు అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మహతి ఆడిటోరియంలో వీఆర్ఏలకు పోస్టింగ్‌ల ఉత్తర్వుల అందజేత, పీఎస్ఆర్ గార్డెన్స్‌లో బీసీ బంధు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ తదితర కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

అధ్యాపకులకు అభినందనలు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ (స్వయం ప్రతిపత్తి) కళాశాలకు చెందిన ఐదుగురు అధ్యాపకులకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. గురువారం వారిని అభినందించారు. భౌతిక శాస్త్ర భాగానికి చెందిన నేరండ్ల బైరయ్య, జంతు శాస్త్ర విభాగానికి చెందిన గనమైన వైకుంఠం, గణిత శాస్త్ర విభాగాన్ని చెందిన ఎర్రన్నగారి లక్ష్మి నరసింహారెడ్డి, గణిత శాస్త్ర విభాగాన్ని చెందిన దీపిక, సంగీత చేసిన పరిశోధనలగాను ఉత్తరప్రదేశ్‌లోని మోనాడ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది.

సభను జయప్రదం చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ పిలుపు ఇచ్చారు. గురువారం సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన ఆవిర్భావ సభ జరుగుతుందన్నారు. సభకు పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రవిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సదన్ మహారాజ్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్‌ల పరిశీలన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎస్ఓ, ఉపాధ్యాయుల పోస్టులకు అర్హత సాధించిన వారికి శుక్రవారం సిద్దిపేట అర్బన్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సర్టిఫికెట్‌ల పరిశీలన చేస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. అర్హుల జాబితా ఇప్పటికే ప్రకటించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలన్నారు.

పశువులకు టీకాలు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెల్ల గ్రామంలో గురువారం సర్పంచ్ గాజుల రమేష్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ శ్రవణ్‌కుమార్, వార్డు సభ్యులు తిరుపతి, రవీందర్, నరేష్, గోపాలమిత్ర సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

రోగులకు కార్పొరేట్ తరహా వైద్యం

● **జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ**



విద్యార్థినికి మాత్రలు వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ ఆస్పత్రల్లో కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు అందుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం, అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ అన్నారు. జాతీయ పైలేరియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో గురువారం అల్బెండజోల్, డీఈసీ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో తొమ్మిది పీహెచ్‌సీల పరిధిలో మాత్రమే బోదకాల బాధితులు ఉన్నట్లు గుర్తించామన్నారు. పుల్లూరు, నారాయణరావుపేట, అంబేద్కర్‌నగర్ యూపీహెచ్‌సీ, జగదేవ్‌పూర్, తీగుల్, అహ్మదీపూర్, రాయపోలు, దౌల్తాబాద్, తొగుట పీహెచ్‌సీల పరిధిలో మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఈనెల 25 వరకు మాత్రలు పంపిణీ చేయడం జరుగుతందన్నారు. రెండేళ్లు పైబడిన వారు అల్బెండజోల్, డీఈసీ మాత్రలు వేసుకోవాలని, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఈ మాత్రలు తీసుకోకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీమేరీ, వైద్య సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలకు మాత్రలు పంపిణీ

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 3 నుంచి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి మాప్ అప్ డే ద్వారా సిబ్బంది మాత్రలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. 19 ఏళ్ల లోపు ఉన్న 2,34,840 మంది బాలబాలికలకు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 98.68 శాతం మాత్రల పంపిణీ జరిగినట్లు వివరించారు.

2,54,677 మందికి..

జాతీయ బోదకాల వ్యాధి నివారణకు జిల్లాలో నిర్వహించిన ఎమ్‌డీఏ కార్యక్రమంలో గురువారం 13,269 మందికి అల్బెండజోల్, డీఈసీ మాత్రలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

కోర్టు ఏర్పాటుపై మాట్లాడే హక్కులేదు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటుపై మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికిలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ చేర్యాలలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటులో విజయం సాధించిన న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. రెండేళ్లుగా చేర్యాలకు కోర్టు రాకుండా నిర్లక్ష్యం చేసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కోర్టు తెచ్చానని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రెండేళ్ల క్రితమే చేర్యాలకు కోర్టు మంజూరైందని, అప్పటి జిల్లా జడ్జి, సీపీలు వచ్చి కోర్టు భవనాన్ని పరిశీలించి విషయాన్ని పక్కన పెట్టారన్నారు. దీనిపై చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాల న్యాయవాదులు అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో తానే తెచ్చానని చెప్పి ఓట్లుఅడిగే ప్రయత్నంలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. రెవెన్యూ డివిజన్ అతి చిన్న సమస్య అని అభివర్ణించిన ఎమ్మెల్యే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జీవో తీసుకురావాలని సవాల్ విసిరారు. సమావేశంలో నాయకులు వెంకట్‌మావో, నాగరాజు, శ్రీహరి, అశోక్, ప్రభాకర్, మల్లేశం, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదు

ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు వేణు



మాట్లాడుతున్న వేణు

చేర్యాల(సిద్దిపేట): పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు పుల్లిని వేణు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఆత్మకూరి హరికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లలో రూ.5,177 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. సకాలంలో వాటిని విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. పెండింగ్‌లోఉన్న బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సుజిత్, తిరుపతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



సర్టిఫికెట్ ఇస్తున్న సర్పంచ్

కొండపాక(గజ్వేల్): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ పాలకంపల్లి జయంతి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో గురువారం మహిళలకు కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.



‘గృహలక్ష్మి’కి దరఖాస్తుల వెల్లువ



అక్కన్నపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): దరఖాస్తుకు చివరిరోజు కావడంతో ఎంపీడీఓ కార్యాలయంలో గృహలక్ష్మి లబ్ధిదారులు బారులు తీరారు. మరికొందరు దరఖాస్తుకు అవసరమైన కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు తీశారు. దీంతో ఆ కార్యాలయాలు కిటకిటలాడాయి. సొంత జాగాలో ఇల్లు నిర్మించుకునేవారికి ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించడంతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు తరలివచ్చారు. గురువారం సాయంత్రం వరకు 1,750 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. కాగా ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, ఎంపీపీ మాలోతు లక్ష్మీ ఆదేశాల మేరకు రాత్రి 8 గంటల వరకు దరఖాస్తులు స్వీకరణకు సమయం ఇచ్చారు. దీంతో దరఖాస్తులు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

హుస్నాబాద్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు గురువారం ముగియడంతో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. మున్సిపల్ కార్యాలయంలో గురువారం దరఖాస్తుల స్వీకరణకు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. గురువారం 518 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు 1,040 దరఖాస్తులు స్వీకరించారు. గడువు పెంపుపై ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

779 దరఖాస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో గృహలక్ష్మి పథకానికి భారీ స్పందన వచ్చింది. గురువారం 779 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రాము తెలిపారు. బుధవారం 340 రాగా మొత్తం 1,119 వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు భారీగా తరలిరావడంతో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి.

దరఖాస్తు గడువు పెంచండి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం గడువు పెంచాలని బీజేపీ రాష్ట్ర కాక్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి డిమాండ్ చేశారు. గురువారం హుస్నాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపి తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాం చక్రవర్తి మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజులు గడువు విధించడంతో నిరుపేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పారిశుద్ధ్యంపై అవగాహన**

సిద్దిపేటకమాన్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సిబ్బందికి అందజేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ వార్డు ప్రజలకు సూచించారు. నడుస్తూ చెత్త తొలగిద్దాం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 36వ వార్డులో చెత్తను తొలగించి వారికి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు.

◆ **అధిక విద్యుత్ బిల్లులపై ఆందోళన**

కోహెడరూరల్(హుస్నాబాద్): అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని మండలంలోని బస్వాపూర్ గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు. ప్రతీనెల రూ.200 వచ్చేబిల్లు రూ.1600 రావడంతో వారు అవాక్కయ్యారు. గ్రామానికి లైన్ ఇన్స్‌పెక్టర్‌ను పిలిచి వాగ్వావాదానికి దిగారు. లోడు ఎక్కువగా ఉండటంతోపాటు జీఎస్‌టీకలిపి బిల్లులు వచ్చాయని చెప్పాడు. కొందరికి ఎక్కువగా వచ్చిందని, వెంటనే సవరించి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

◆ **పార్టీ నేతకు పరామర్శ**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు తండ్రి బంక రాజయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గురువారం చందు కుటుంబాన్ని పరామర్శించారు. పొన్నం వెంట సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్ చిత్తారి పద్మరవీందర్ తదితరులు ఉన్నారు.

◆ **పశువులకు టీకాలు వేయించండి**

హుస్నాబాద్: గాలికుంటు, లంపిస్కిన్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేయించాలని హుస్నాబాద్ ప్రాంతీయ పశు వైద్యశాల డాక్టర్ వెంకట్‌రెడ్డి రైతులకు సూచించారు. పట్టణంలోని పశువైద్యశాలలో గురువారం టీకా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం వారం పాటు కొనసాగుతుందని, రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మొగిలి బుచ్చయ్య, పావని, మీనా, ఆంజనేయులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్‌లోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన బోధించుకుటకు సిబ్బంది కావాలని పాఠశాల ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ గురువారం తెలిపారు. పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ సోషల్ సబ్జెక్టు బోధించుటకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైనవారికి రూ.18,200 గౌరవ వేతనం లభిస్తుందన్నారు.

◆ **రసాయన ప్యాడ్లు వాడొద్దు**

నంగునూరు(సిద్దిపేట): మహిళలు రసాయన ప్యాడ్లు వాడితే వ్యాధులబారినపడే అవకాశం ఉందని పర్యావరణ పరిరక్షకురాలు డాక్టర్ శాంతి అన్నారు. గురువారం తిమ్మాయిపల్లి, కోనాయిపల్లి, ముండ్రాయి గ్రామాల్లో రుతుప్రేమపై ప్రత్యేక సమావేశం నిర్వహించి మహిళలకు మెన్స్టస్ కప్పుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, డీపీఓ దేవకీదేవి, శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **పట్టామార్పిడికి అవకాశం**

రాయపోలు(దుబ్బాక): ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములను కొనుగోలు చేయడం, అమ్మడం నిషేధమని రాయపోలు తహసీల్దార్ జహీర్ తెలిపారు. గతంలో తెలియక వాటిని కొనుగోలు చేసి సాగుచేస్తున్న చిన్న, సన్నకారు రైతులకు రీ అసైన్‌మెంట్ చేసే అవకాశం ఉందన్నారు. ఐదెకరాలలోపు ఉంటే ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పట్టామార్పిడికి అవకాశం ఉందన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం**

దుబ్బాక: సీఎంఎఫ్ఎఫ్ పథకం పేదలకు వరమని కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మీ సంజీవరెడ్డి అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన దుర్వాస కవిత అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం స్పందించి రూ.16 వేలు చెక్కు రూపంలో మంజూరు చేసింది. ఈ చెక్కును గురువారం లబ్ధిదారుకి అందజేశారు.

◆ **సత్యసాయి రథయాత్ర**

దుబ్బాకటౌన్: సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో పట్టణంలో భగవాన్ సత్యసాయి రథయాత్రను గురువారం సాయంత్రం శోభాయమానంగా నిర్వహించారు. వైశ్యభవన్ నుంచి ప్రారంభమైన యాత్ర ప్రధాన వీధుల గుండా సాగింది. యాత్రలో భక్తులు కీర్తనలు పాడారు. యాత్ర అనంతరం వైశ్య భవన్‌లో సత్సంగం జరిగింది.

◆ **సీపీఎస్‌ను రద్దు చేయాలి**

గజ్వేల్‌రూరల్: కాంట్రిబ్యూటరీ పెన్షన్(సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం ధర్నా పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.